## క్లుప్తంగా

### ఉత్సవాలకు ఏర్పాట్లు

నవాబుపేట: కాకర్‌జాల్‌తండా సమీపంలో గుట్టపై వెలసిన పెరుమళ్ల ఆంజనేయస్వామి ఉత్సవాలు శనివారం జరగనున్నాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అదేవిధంగా శుక్రవారం అలంకరణ, యువతకు క్రీడాపోటీలు నిర్వహించారు. శనివారం ఉదయం అలంకరణ, చందనోత్సవం, తమలపాకుల అర్చన, సాయంత్రం శకటోత్సవం ఉంటాయని నిర్వాహకులు సంతోష్‌నాయక్, ప్రేమ్‌కుమార్, బుద్ధునాయక్, శ్రీనివాస్‌నాయక్ తదితరులు తెలిపారు. ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి పాల్గొంటారని వివరించారు.

### బాధ్యులను కఠినంగా శిక్షించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పశ్చిమ బెంగాల్‌లో లైంగిక దాడి చేసి డాక్టర్‌ను హత్య చేసిన ఘటనలో బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి వి.పద్మ, టీపీఎస్‌కే జిల్లా కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఐద్వా, టీపీఎస్‌కే ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు భరత్, నాయకులు ఈశ్వర్, బాలచంద్రుడు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకు వినతి

స్టేషన్ మహబూబ్‌నగర్: సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ ఉద్యోగ సంఘాల నాయకులు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 2004లో నాటి ప్రభుత్వం ఇచ్చిన 28 జీవో ద్వారా నూతనంగా ఎంపికైన ప్రభుత్వ ఉద్యోగులు పెన్షన్ సౌకర్యం కోల్పోయారని, ఆ జీవోను రద్దు చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థితప్రజ్ఞ, శ్రీకాంత్, నరేష్‌గౌడ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నేడు జిల్లా కేంద్రంలో చిరుధాన్యాలపై జరిగే ఆరోగ్య సదస్సులో పాల్గొనాలని నిర్వాహకులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు.

### 'అసలైన మనువాది మందకృష్ణ'



మహబూబ్‌నగర్ రూరల్: మాదిగల ఆత్మగౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెట్టిన మందకృష్ణకు మాలల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని.. తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సమావేశంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మాట్లాడారు. మందకృష్ణకు మతిభ్రమించిందన్నారు. మాలలు మనువాదులు అని సంబోధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మందకృష్ణ అసలైన మనువాది అని అన్నారు. ప్యాకేజీల కోసం మాత్రమే పోరాటం చేసిన చరిత్ర ఆయనదన్నారు. లక్ష్మణ్, వెంకటస్వామి, యాదయ్య, బాలరాజు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: అడ్డాకుల మండలం కాటవరం గ్రామంలో విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన రవి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నాయకులు శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి పేర్కొన్నారు. రవి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తూ ప్రమాదానికి గురికావడం బాధాకరమని అన్నారు. అతడికి భార్యతో పాటు 45 రోజుల బాబు ఉన్నాడని.. అతడి మరణంతో కుటుంబం దిక్కు తోచని స్థితిలోకి పడిపోయిందన్నారు.

### పాలమూరులో పెట్రోల్ దొంగలు

మహబూబ్‌నగర్ క్రైం: ఇటీవల పట్టణంలో రాత్రి వేళలో చోరీలు పెరుగుతున్నాయి. తాజాగా లక్ష్మీనగర్ కాలనీలో దొంగల ముఠా సంచరించిన విషయం తెలిసిందే..అయితే శుక్రవారం తెల్లవారుజామున పట్టణంలో బోయపల్లి గేట్ సమీపంలో ఓ అపార్ట్‌మెంట్‌లో కింద పార్కింగ్‌లో నిలిపిన ద్విచక్ర వాహనాల నుంచి ఇద్దరూ గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ దొంగలించారు. పార్కింగ్‌లో వరుసగా నిలిపిన వాహనాల నుంచి బాటిల్స్‌లలో పెట్రోల్ తీస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఇంటి ఎదుట నిలిపిన బుల్లెట్ వాహనం నుంచి కూడా పెట్రోల్ తీసినట్లు తెలిసింది.

### ఘనంగా వేడుకలు

జడ్చర్ల టౌన్: చంద్రయాన్ 3 సక్సెస్ అయిన రోజు కావటంతో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌సీసీ, భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డా. సుకన్య మాట్లాడారు. ఏటా అంతరిక్ష దినోత్సవం నిర్వహించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. కో ఆర్డినేటర్ డా.శ్రీనివాసులు, అధ్యాపకులు రాజేశ్వరి, పుష్పలత, నాగలక్ష్మి, ఆంజనేయులు పాల్గొన్నారు.





గండేడ్ మండల పరిధిలోని లింగాయిపల్లికి చెందిన చిన్నయ్య రంగారెడ్డిపల్లి సమీపంలో నాలుగు ఎకరాల భూమి కౌలుకు తీసుకున్నాడు. జూన్ నెలలో దాంట్లో మొక్క జొన్న పంట వేశాడు. ఇప్పటికి రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాడు. చుట్టూ ఫెన్సింగ్ వైరు కూడా ఏర్పాటు చేశాడు. అయినా పందులు దాన్ని దాటుకుని వచ్చి మొక్క జొన్న పంటను నాశనం చేస్తున్నాయి. పది పదిహేను రోజులుగా కంకులు పడుతున్నాయి. అవి పెరగకముందే పందులు తినేస్తున్నాయి. రాత్రుళ్లు వచ్చి నాశనం చేస్తుండడంతో.. పంటను రక్షించుకొనేందుకు రైతు చిన్నయ్య నానాపాట్లు పడుతున్నాడు.



జంగంరెడ్డిపల్లి గ్రామానికి కోస్గి చిన్నయ్య ఎకరంన్నర పొలంలో పచ్చ జొన్నలు వేశాడు. దాదాపు రూ. 25 వేల వరకు పెట్టుబడి అయ్యింది. నెల రోజులు అయితే కోతకు వస్తుంది. గుట్ట దగ్గరగా ఉండడంతో అడవి పందుల బెడద ఎక్కువగా ఉంది. గత కొన్ని రోజుల నుంచి పందులు మకాం పెట్టాయి. జొన్న దంట్లను పెకిలించి వేస్తున్నాయి. అంతటితో ఆగక అడ్డంగా తొక్కేస్తున్నాయి. ఇప్పటికే అర ఎకరం పొలం వరకు పూర్తిగా పనికి రాకుండా చేశాయి. దీంతో ఏం చేయలేక పాలుపోని పరిస్థితిలో ఉన్నాడు.

# కునుకు కరువు..

- పంటలపై స్వైరవిహారం చేస్తున్న అడవి పందులు
- కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్న రైతులు



మన్సూర్‌పల్లిలో మొక్కజొన్న పంట పరిస్థితి..



జంగంరెడ్డిపల్లి సమీపంలో అడవి పందులు నాశనం చేసిన జొన్నపంట

గండేడ్: మండల పరిధిలో పైన పేర్కొన్న ఇద్దరిదే కాదు వర్షకాలం పంటలు వేసిన దాదాపు అందిరి రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. ఓవైపు పెట్టుబడి భారంతో కుదేలవుతున్న రైతులకు.. పంటలపై పందుల దాడులు శాపంగా మారాయి. దీంతో పంటను కాపాడుకునేందుకు కంటిమీద కునుకు కరువైంది. దాదాపు అన్ని గ్రామాల్లో సమస్య ఉంది. మరీ ముఖ్యంగా గుట్ట అంచున ఉన్న పొలాల వారికైతే మరింత కష్టం ఎదురవుతోంది. గండేడ్ మండలంలో 23,500 ఎకరాలు, మహమ్మదాబాద్‌లో 16,800 ఎకరాలు సాగుకు అనుకూలంగా ఉంది. ఇందులో వరి, జొన్న, మొక్కజొన్న, కంది తదితర పంటలు వేశారు. చాలా వరకు పొలాలు అడవులకు, గుట్టలకు దగ్గరగా ఉన్నాయి. అయితే ఈ అడవుల్లో పందులు, తదితర జంతువులకు సరైన ఆహారం దొరకక గ్రామాలవైపు వస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. గతంలో వేరుశనగ పంటని ఎక్కువగా నాశనం చేసేవని ప్రస్తుతం అన్ని పంటలను నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. మొక్క జొన్న, జొన్న, రాగులు, కంది పంటలనే కాకుండా.. కూరగాయల తోటలను సైతం వదిలి పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఏంచేయాలో దిక్కు తోచడం లేదని చెబుతున్నారు. సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసినా కూడా పంటలను రక్షించుకోవడం కష్టంగానే ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇలా పంటలను నష్టపోతున్న రైతులను గుర్తించి ఆదుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.



చౌదర్‌పల్లిలో దెబ్బతిన్న జొన్న చేను

#### వరినారు తినేశాయి..



కొండాపూర్ బొందెగట్టు సమీపంలో గుట్టను ఆనుకొని మా పొలం ఉంది. ఇక్కడ పందుల బెడద చాలా ఎక్కువగా ఉంది. ఎప్పుడు ఏ పంటవేసినా సగానికి పైగా పాడవుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని జొన్న చేను చుట్టూ సోలార్ కంచె వేశాను. ప్రస్తుతం పందులు దీని దగ్గరికి రావడం లేదు. ఉన్న మిగతా పొలంలో వరి నారు వేశాను కానీ పందులు తినేస్తున్నాయి.

– చెన్నయ్య, రైతు, కొండాపూర్

#### నాశనం చేస్తున్నాయి.



నేను రెండు ఎకరాల్లో జొన్న పంట వేశాను. పంట వేసినప్పటి నుంచి కూడా పందుల బెడద ఉంది. చేనంత పెకిలించి వేస్తున్నాయి. ఇంకొంత కాలమైతే పంట చేతికొస్తుంది. ఇలాంటి సమయంలో పందులు మొత్తం నాశనం చేసేస్తున్నాయి.

– కావలి ఆనంద్, చౌదర్‌పల్లి, మహమ్మదాబాద్ మండలం

### వేతనాలు ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 12 నెలల జీతాలు వెంటనే ఇవ్వాలని.. పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కురుమూర్తి, వెంకటేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం డీపీఓ పార్థసారథికి వినతి పత్రం సమర్పించారు. ఈనెల 26లోపు జీతాలు ఇవ్వాలన్నారు. లేనిచో మరుసటి రోజు నుంచి సమ్మెలోకి దిగుతామని హెచ్చరించారు. 12 నెలలుగా జీతాలు ఇవ్వకుంటే ఎలా జీవించాలని ప్రశ్నించారు. శివరాములు, రఘు పాల్గొన్నారు.

### పుస్తె మెట్టెలు అందజేత

గండేడ్: వెన్నాచేడ్‌కి చెందిన మొగులమ్మ వివాహం శుక్రవారం నిర్వహించగా.. గ్రామానికి చెందిన చౌదరి రవికాంత్‌రెడ్డి, మధురవేణి దంపతులు పుస్తె, మెట్టెలు అందజేశారు. ఇక నుంచి పేదింటి ఆడపిల్లల వివాహాలకు క్రమం తప్పకుండా పుస్తె మెట్టెలు ఇవ్వనున్నట్లు వివరించారు. దశరథ్, బాలయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా బోనాల పండుగ



అడ్డాకుల: మూసాపేటలో శక్రవారం పోచమ్మ బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. సంకలమద్ది శివారులో ఉన్న గుండ్ల చెరువు కట్ట వద్ద ఉన్న ఆలయానికి మూసాపేట, సంకలమద్ది, బంగ్లగడ్డ మహిళలు బోనాలను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

**తాటిచెట్టు మైసమ్మ బోనాలు**

జడ్చర్ల టౌన్: పట్టణంలోని తాటిచెట్టు మైసమ్మ బోనాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.మురళీ పాల్గొని పూజలు చేశారు.

దేవరకద్ర: గోపన్‌పల్లిలో శుక్రవారం పోచమ్మ బోనాల పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కుమ్మరి రాంబాబు, వెంకటేష్, జ్ఞానేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, రామస్వామి పాల్గొన్నారు.

### చిన్నారుల్లో దేశభక్తి పెంపొందించాలి



నవాబుపేట: సరస్వతీ శిశుమందిరాలు క్రమశిక్షణకు మూలాలని.. వాటిని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సరస్వతీ శిశుమందిర్ నూతనభవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం చిన్నారులకు నోట్‌బుక్స్ అందించారు. చిన్నారుల్లో దేశభక్తి పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఇందిరాదేవి, సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, నిర్వాహకులు చంద్రశేఖర్, సుధాకర్‌జీ, శివకుమార్, రామకృష్ణ, ఆనంద్, సత్యం, నర్సింహ పాల్గొన్నారు.

### ఆలయాల్లో 'శ్రావణ' పూజలు



స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రావణ మాసపు శుక్రవారం సందర్భంగా పట్టణంలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు శక్తి ఆలయాల్లో మహిళలు విశేషపూజలు చేపట్టారు. బస్టాండ్ సమీపంలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని అలంకరించారు. వేంకటేశ్వర కాలనీలోని రాజరాజేశ్వరి ఆలయంలో, పద్మావతి కాలనీలోని సంతోషి మాత ఆలయంలో, వీరన్నపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో, రవీంద్రనగర్‌లోని పోచమ్మ దేవాలయంలో పూజలు ఘనంగా చేపట్టారు.

### విద్యార్థులకు వైద్య పరీక్షలు

గండేడ్: విద్యార్థులు వ్యకిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ సునీల్ పేర్కొన్నారు. శుక్రవారం వెన్నాచేడ్‌లోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏచిన్న సమస్య వచ్చిన వెంటనే వైద్యసిబ్బందిని సంప్రదించాలని సూచించారు. వార్డెన్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ యాదమ్మ, హెల్త్ అసిస్టెంట్ గోపాల్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

మిడ్జిల్: రాణిపేట్ బంగారు మైసమ్మ ఆలయం సమీపంలో జడ్చర్ల -కల్వకుర్తి ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఘటనలో జడ్చర్లకు చెందిన మధు, వల్లభ్‌రావుపల్లికి చెందిన శివలింగం, చింటు తీవ్ర గాయపడ్డారు. స్థానికులు వారిని 108లో జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. కాగా మధు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

### సామర్థ్యాలు పెంపొందించాలి

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండల కేంద్రంలోని ఓ పాఠశాలను శుక్రవారం ఎంఈఓ జయశ్రీ తనిఖీ చేశారు. పాఠశాలలోని వివిధ రికార్డులు, రిజిస్టర్‌లను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించారు. సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు.

### వ్యక్తి అదృశ్యంపై కేసునమోదు

జడ్చర్ల: స్థానిక మాధవరావు కాంపౌండ్‌కు చెందిన వంగూరు రాజు(37) గత ఆరు మాసాల నుంచి కనిపించకుండా పోయాడని తండ్రి లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. తమ కుమారుడు రాజు భార్యతో గొడవ పడి 2022 ఏడాదిలో తమ దగ్గరకు వచ్చాడని లక్ష్మయ్య వివరించారు. ఆరుమాసాల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

## సకాలంలో వైద్యసేవలు అందించాలి

జడ్చర్ల టౌన్: సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని.. పీహెచ్‌సీకి వచ్చే ప్రతి ఒక్కరికి సకాలంలో వైద్యసేవలు అందించాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆదేశించారు. శుక్రవారం గంగాపురం పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రి రికార్డులు, వార్డులు, ల్యాబ్, ఫార్మసీ తదితరాలను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి సౌకర్యాల గురించి ఆరాతీశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి నరేష్‌తో పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా ఆస్పత్రి ఆవరణలో మొక్కనాటి నీళ్లు పోశారు. ఆయనతోపాటు జెడ్పీసీఈఓ వెంకట్‌రెడ్డి ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

## మహిళా సంక్షేమానికి పెద్దపీట



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హన్వాడ మండలానికి చెందిన 100 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో అందజేశారు. తాము మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు వివరించారు. మండల అధ్యక్షుడు మహేందర్, సుధాకర్‌రెడ్డి, నవనీత, శారద, నర్సింలు, యాదిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బీఐ సేవలను వినియోగించుకోవాలి

రాజాపూర్: సోషల్ సెక్యూరిటీ స్కీంలను, ఎస్‌బీఐ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రధాన్‌మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనలో ఉండి దురదృష్టవశాత్తు మృతిచెందిన ద్యాగమల్లేష్, బొక్కనర్సింలు, ఉల్కుంద రత్న, కోస్గి సరళల పేరున మంజూరైన రూ.రెండలక్షల చెక్కులను నామినీలకు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారు కూడా తక్కువ ప్రీమియం చెల్లించి పీఎంజేజేబీవై చేసుకోవచ్చన్నారు. బ్రాంచ్ మేనేజర్ మధువని, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఆర్‌ఎం అనిల్‌కుమార్

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



దోకూర్ కేజీబీవీలో భోజనం పరిశీలిస్తున్న అధికారులు



మిడ్జిల్‌లో విద్యార్థులతో కలిసి భోజనాలు చేస్తున్న అధికారులు

చిన్నచింతకుంట: పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో పరిశుభ్రతను పాటించాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ కృష్ణయ్య సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, కేజీబీవీ, బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఎంపీఓ అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలోని కేజీబీవీని శుక్రవారం రాత్రి మండల ప్రత్యేకాధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనాలు అందించాలని సూచించారు. తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర రూరల్: డోకూర్ సమీపంలోని కేజీబీవీని ఎంఆర్‌ఓ శ్రీనివాస్ ఇతర అధికారులు సందర్శించారు. పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్ గీతాకుమారి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: పట్టణంలోని ఎస్టీ హాస్టల్‌ను శుక్రవారం ప్రత్యేక అధికారి వేణుగోపాల్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం తదితరాలపై అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి అధికారి ప్రభాకర్, ఎఈఈ రాజేంద్ర కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల ఉన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



నవాబుపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. శుక్రవారం రేకులచౌడాపూర్, లింగంపల్లి, లోకిరేవు గ్రామాల్లో ఆయన పర్యటించి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. డెంగీ లాంటి వ్యాధులు సోకకుండా ఉండాలంటే పరిశుభ్రతను పాటించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈఓ పీఆర్‌డీ బద్రునాయక్, ఏపీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



### మున్సిపల్ కార్మికుల నిరసన ర్యాలీ

జడ్చర్ల టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కార్మికులు పట్టణంలోని నేతాజీ చౌరస్తా నుంచి భీమయ్య హోటల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. 10 గంటలకు విధులు ముగించుకుని ర్యాలీలో పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య మాట్లాడారు. 18రోజులుగా వరుస ఆందోళనలు చేపట్టినప్పటికీ కమిషనర్, పాలకవర్గం స్పందించకుండా సమస్యను పెద్దదిగా చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా సమస్యలు తీర్చేందుకు ముందుకు రావాలని కోరారు. యూనియన్ పట్టణ అధ్యక్షుడు మహేష్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, కార్మికులు పాల్గొన్నారు.



## అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదు





స్టేషన్ మహబూబ్‌నగర్: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని పలు ముస్లిం సంఘాల ప్రతినిధులు అన్నారు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో మిల్లీ మహాజ్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో శుక్రవారం జుమా నమాజ్ అనంతరం ధర్నా నిర్వహించారు. ప్లకార్డులతో నిరసన చేపట్టారు. మతాల విద్వేషాలు రెకెత్తించడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్రలో త్వరలో ఎన్నికలు రాబోతున్నాయని, అందువల్లే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వ్యాఖ్యలు చేసిన రాంగిరి మహారాజ్‌ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రపతికి రాసిన లేఖను జిల్లా అదనపు కలెక్టర్‌కు అందజేశారు. చీఫ్ ప్యాట్రన్ ఖాజా ఫయాజుద్దీన్ అన్వర్‌పాషా, కన్వీనర్ తఖీ హుస్సేన్, కోకన్వీనర్లు హాఫిజ్ ఇద్రీస్, ఖుద్దూస్‌బేగ్ పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

- మౌంట్ బాసిల్ హైస్కూల్‌లో ఆకట్టుకున్న మోడల్స్, చార్ట్ మేకింగ్ పోటీలు



మాట్లాడుతున్న డీఎస్‌ఓ బి.శ్రీనివాస్, ఏఎంఓ డి.శ్రీనివాస్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రం శివారులోని మౌంట్ బాసిల్ హైస్కూల్‌లో మోడల్ మేకింగ్, చార్ట్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. కాగా ముఖ్య అతిథులుగా హాజరైన డీఎస్‌ఓ బి.శ్రీనివాస్, ఏఎంఓ డి.శ్రీనివాస్‌కు విద్యార్థులు తాము తయారుచేసిన మోడల్స్, వాటి ప్రత్యేకతలను వివరించారు. వీటిలో చంద్రయాన్–3, రాకెట్ మోడల్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులను పాఠశాల చైర్మన్ చంద్రకళా వెంకటయ్య, శిరీష ప్రవీణ్, డైరెక్టర్లు సుశాంత్‌కృష్ణ, పూజితామోహన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సోమశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ కె.సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

### ప్రకృతి వైద్యంపై నేడు సదస్సు

మహమ్మదాబాద్: ప్రకృతి వైద్యంపై శనివారం జరిగే అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా కార్యదర్శి అంజిరెడ్డి, గాంధీ గ్లోబల్ ట్రస్టు అధ్యక్షుడు రాజేందర్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో జిల్లా ప్రైవేటు స్కూల్ అసోషియేషన్, గాంధీ గ్లోబల్ స్కూల్ యోగా విద్యాలయం ఆధ్వర్యంలో సదస్సు ఉంటుందన్నారు.